ప్రజాధనం వృథా!

- తుప్పు పడుతున్న మున్సిపల్ వాహనాలు
- వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ..
- పట్టించుకోని అధికారులు


మున్సిపల్ స్థలం లేకపోవడంతో ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో నిలిపిన వాహనాలు


ఆరుబయట ఉన్న ట్రాలీ ఆటోలు

బాన్సువాడ : లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన మున్సిపల్ వాహనాలు తుప్పు పడుతున్నా..సంబంధిత శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీలో ప్రజాధనం అంటే లెక్కే లేకుండా పోయింది. ఇంటి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ఆయా మార్గాల్లో జరిమానాలు, నిర్మాణ సమయంలో అనుమతుల పేరిట ఏటా కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతుంది. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొంత నిధులు విడుదల చేస్తుంది. ఒక్కోపైసా ఖర్చు చేసే సమయంలో బాధ్యత ఉండాలి. అభివృద్ధి పనుల్లో నాణ్యత, ప్రజలకు సౌకర్యాలు కల్పించే సమయంలో మూణ్నాళ్ల పాటు బాగుండే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. సానిటేషన్ నిర్వహణ, చెత్త సేకరణ కోసం రూ.లక్షల ప్రజాధనం ఖర్చు చేసి కొనుగోలు చేసిన వాహనాలను మూలనపడేశారు.

మూలనపడ్డ వాహనాలు

ట్రాక్టర్ ట్రాలీలు	01
ట్రాలీ కం ఇంజిన్లు	01
హైడ్రాలిక్ ఆటోలు	01

మరమ్మతులు చేయిస్తే ఉపయోగంలోకి..

మరమ్మతులు చేయిస్తే ఉపయోగంలోకి వచ్చే ఆటో ట్రాలీలు అక్కరకు రాకుండా పోతున్నాయి. ట్రాక్టర్ ఇంజిన్ మూలనపడింది. పట్టణంలో రూ.కోట్లా విలువ చేసే 10 శాతం స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. చెత్త సేకరించే ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్లు పెట్టుకోవడానికి గజం స్థలం దొరకడం లేదు. ప్రస్తుతం ట్రాక్టర్లు ట్రాలీ ఆటోలు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో, కొత్త మున్సిపల్ కార్యాలయం వెనకాల వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతున్నాయి. వర్షాలకు తడుస్తూ ట్రాక్టర్ ట్రాలీలు, ఆటో ట్రాలీలు తుప్పు పడుతున్నాయి. సానిటేషన్ సిబ్బందికి హాజరు కోసం ఒక గది కూడా లేని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం 1వ వార్డులో వృథాగా ఉన్న అటవీశాఖ గదిలో సానిటేషన్‌కు సంబంధించిన వస్తువులను పెట్టుకుంటున్నారు. రూ.లక్షల సొమ్ము మట్టి పాలు చేస్తూ.. కనీసం సానిటేషన్ నిర్వహణకు ఒక కేటాయించక పోవడం గమనర్హం.


మూలన పడ్డ ట్రాక్టర్లు

మున్సిపల్ సానిటేషన్ విభాగం వాహనాలు

ట్రాక్టర్లు	ట్రాలీ ఆటోలు	ఫాగింగ్ యంత్రాలు	స్ప్రేయర్లు	సానిటేషన్ కార్మికులు
08	15	02	05	95

క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండలంలోని వజ్జపల్లితండాలో బాధితుడికి ఎల్‌వోసీ పత్రాన్ని గురువారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. తండాకు చెందిన బానోత్ భీమా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్.. ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె స్పందించి రూ.2 లక్షల ఎల్‌వోసీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ నాయక్, దొడ్లె రవి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అలయ్..బలయ్ సభను జయప్రదం చేయాలి

బాన్సువాడ : ఈ నెల 27న కామారెడ్డిలో జరిగే అలయ్.. బలయ్ సభను విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింలు, డివిజన్ అధ్యక్షులు ప్రశాంత్‌లు కోరారు. గురువారం బాన్సువాడలో వారు మాట్లాడుతూ..సభకు ముఖ్య అతిథిగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వస్తున్నారని, ఆయనతో పాటు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్ హాజరవుతున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు చిన్న సాయిలు, కొత్తబాది సాయిలు, ఎర్రమోహన్, మన్నేచిన్న సాయిలు, తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



దోమకొండ: పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని బీజేపీ జిల్లా నాయకులు, మండల ఇన్‌చార్జి కుంట లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో మండలానికి చెందిన నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి కార్యకర్తలతో చర్చించారు. నాయకులు సంతోష్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, అనుపాటి నరేందర్, గంగా జమున, కంది మనోజ్ కుమార్, తదితరులున్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ కోరారు. మండలకేంద్రంలో గురువారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు కార్యకర్తలు వివరించాలన్నారు. నేతలు శ్రీనివాసరెడ్డి, దివిటి కిష్టయ్య, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువత పెడదారి పట్టొద్దు



రామారెడ్డి: యువత డ్రగ్స్ బారిన పడి పెడదారి పట్టొద్దని రామారెడ్డి ఎస్సై లావణ్య సూచించారు. రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సైబర్ నేరాలు, డ్రగ్స్, షీటీమ్స్, రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు ఎస్సై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలున్నా షీ టీమ్స్ నంబర్ 8712686094ను సంప్రదించాలన్నారు. 1930, 100 నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలన్నారు. రామారెడ్డి ఏఎస్సై సంపత్, కానిస్టేబుల్ పవన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్టు కింద కన్నాపూర్ తండా ఎంపిక

రామారెడ్డి: కన్నాపూర్ తండాను డిజిటల్ హెల్త్ కార్డు స్క్రీనింగ్ కోసం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లుగా రామారెడ్డి వైద్యాధికారి సురేష్ తెలిపారు. గురువారం తండాలో డిజిటల్ హెల్త్ కార్డు స్క్రీనింగ్‌లో భాగంగా ప్రతి వ్యక్తి హెల్త్ ప్రొఫైల్‌ను ఆన్‌లైన్ చేశారు. ఒక్కసారి డిజిటల్ హెల్త్ కార్డు స్క్రీనింగ్ చేస్తే ఏఏ ఆస్పత్రులలో ఏఏ చికిత్సలు పొందారో తదుపరి ఏ చికిత్స అందించాలో సులభంగా తెలుసుకోవచ్చని వివరించారు.

వర్షానికి కూలిన ఇల్లు



భిక్కనూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భిక్కనూరు మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న వీరభత్తిని సిద్దరాములు-మనేమ్మకు చెందిన ఇల్లు పైకప్పు గురువారం వేకువజామున కూలింది. కూలిన సమయంలో వీరు వేరే గదిలో ఉండటం వల్ల ప్రాణ నష్టం తప్పింది.

బ్యాంకు ఖాతాలు తెరిపించండి

భిక్కనూరు : వృద్ధులు, దివ్యాంగులు, కిశోర బాలికలకు సంఘాలను ఏర్పాటు చేసి వారికి బ్యాంక్ ఖాతాలను తెరిపించాలని ఐకేపీ ఏపీడీ విజయలక్ష్మి, ఆర్ఎం కిరణ్‌లు అన్నారు. గురువారం భిక్కనూరు మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో మహిళ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాడి గేదెలను మహిళ సంఘాలు కొనుగోలు చేసేలా చైతన్యవంతులను చేయాలని సూచించారు. దీని వల్ల ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందుతారన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు బ్యాంక్‌ల ద్వారా రుణాలను ఇప్పించి ప్రభుత్వం బిల్లులు చెల్లించగానే తిరిగి చెల్లించే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతి


మాచారెడ్డి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

మాచారెడ్డి : విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు గురువారం మాచారెడ్డి తహసీల్దార్ సరళకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విజయరామరాజు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్హతలేని డీఈవోలను వెంటనే తొలగించి నూతన డీఈవోలను నియమించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్తిస్థాయిలో హెచ్‌ఎంలను నియమించాలన్నారు. ప్రతినిధులు గఫూర్, శ్రీకాంత్‌లు ఉన్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. ఒకేచోట 3 పాఠశాలలు

బాన్సువాడ రూరల్: కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఒకే ఆవరణలో 3 పాఠశాలలు కొనసాగుతున్నాయని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. గురువారం వారు బాన్సువాడ సబ్‌కలెక్టర్ డా.కిరణ్మయికి వినతి పత్రం అందించి మాట్లాడారు. మూడేళ్లుగా పాఠశాలల నిర్మాణ పనులు పిల్లర్ల దశలో ఉండటానికి నాటి ప్రభుత్వం, అధికారులే కారణమన్నారు. వెంటనే చర్యలు తీసుకుని ఇస్లాంపుర యూపీఎస్ పాఠశాలలో కొనసాగుతున్న ఇస్లాంపుర, అరాఫత్ కాలనీ పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు. నాయకులు షేక్ అక్బర్, ఖాదర్, చాంద్‌పాష పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలు.. బురదే


గుంతలమయంగా మారిన బీసీ కాలనీ రోడ్డు


బురదమయంగా మారిన రోడ్డు

ఎల్లారెడ్డిరూరల్ : పట్టణంలోని బీసీ కాలనీ రోడ్డు గుంతలమయంగా, బురదగా మారింది. కాలనీలో గుంతల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులోని బీసీ కాలనీలో మమత హోటల్ పక్క వీధి నుంచి కాలనీకి వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా మారిందని, మరొక రోడ్డు బురదమయంగా మారడంతో వాహనాలపై నుంచి జారి పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలనీలోని గుంతలను పూడ్చి వేసి, బురద రోడ్డుపై మొరం మట్టి వేసి జారి పడకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. కామారెడ్డి పట్టణం, రూరల్‌తో పాటు ఎనిమిది మండలాలకు చెందిన 178 మందికి సీఎంఆర్ఎఫ్, 251 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డి: అడవిలింగాలలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. పోలీస్ లావణ్య, అలేఖ్యలకు కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు చెక్కులను అందజేశారు.

ఎరువుల కొరత లేకుండా నిల్వలు ఉంచుకోవాలి


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా సహకార శాఖాధికారి రామ్మోహన్

భిక్కనూరు: ఎరువుల కొరత లేకుండా సింగిల్ విండోల్లో నిల్వలను ఉంచుకోవాలని జిల్లా సహకార శాఖాధికారి రామ్మోహన్ సూచించారు. గురువారం ఆయన జంగంపల్లి సింగిల్ విండోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్నిరకాల సేవలను సింగిల్ విండోలు అందించాలన్నారు. ఆయన వెంట మానిటరింగ్ అధికారి సురేష్, ఏఈవో లికిల్‌రెడ్డి, విండో కార్యదర్శి మాడుగు రమేష్ యాదవ్‌లు ఉన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు


లింగంపేటలో కేక్ కట్ చేస్తున్న జాజాల సురేందర్

సాక్షి నెట్‌వర్క్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కోసి పంచి పెట్టారు. లింగంపేట, ఎల్లారెడ్డిలలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, కామారెడ్డిలో గంప గోవర్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఇతర నేతలు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొన్నారు. కేటీఆర్ మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని, కేటీఆర్ యువతకు ఆదర్శమైన నాయకుడని వారు కొనియాడారు.


జుక్కల్‌లో.. మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే


కామారెడ్డిలో.. మాజీ ఎమ్మెల్యే గంప, ముజీబొద్దీన్

లబ్ధిదారులను ప్రోత్సహించండి



బాన్సువాడ రూరల్: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరై పనులు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ అన్నారు. గురువారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తికాగానే లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాలో రూ.లక్ష జమ చేస్తామన్నారు. అలాగే గ్రామాల్లో ఓటరు జాబితాను నవీకరణ చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలన్నారు. ఎంపీడీవో ఆనంద్, డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, సూపరింటెండెంట్ ముజాహిద్ ఉన్నారు.

విద్యార్థులకు చదవడం, రాయడం రావాలి


కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రాజులు


నిజాంసాగర్‌లో .. ఎంఈవో తిరుపతిరెడ్డి


నల్లమడుగు సమావేశంలో.. ఎంఈవో షౌకత్ అలీ

ఎల్లారెడ్డి: విద్యార్థులకు చదవడం, రాయడం తప్పకుండా రావాలని, ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈవో రాజులు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లింగమూర్తి, యాదయ్య ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

నిజాంసాగర్(జుక్కల్) : విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని ఎంఈవో తిరుపతి రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అచ్చంపేట కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, వెంకటేశం ఉన్నారు.

బోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి) : ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈవో షౌకత్ అలీ సూచించారు. గురువారం ఆయన నల్లమడుగు కాంప్లెక్స్, లింగంపేట బాలికల ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శోభారాణి, కోటేశ్వర్‌రావు, సీఆర్పీలు సత్యనారాయణ, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు సన్మానం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట, వెల్గనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాల్‌సింగ్, లలితను గురువారం స్థానిక ఎంఈవో తిరుపతిరెడ్డి సన్మానించారు. అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలో 74 మంది విద్యార్థులు ఉండగా ఈ విద్యాసంవత్సరం 105 మందికి చేర్చారు. అలాగే వెల్గనూర్ పాఠశాలలో 17 నుంచి 43 మంది విద్యార్థులకు పెంచడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ



భిక్కనూరు: తిప్పాపూర్‌లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ప్రజల సమస్యలన్నింటిని తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, నేతలు కుంట లింగారెడ్డి, బీంరెడ్డి, జాంగారి గాలిరెడ్డి, కొండ సిద్దరాములు, తదితరులు పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): కంభపూర్ లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్ దేశాయ్, నాయకులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- క్యాన్సర్ వైద్య నిపుణుడు మధు దేవరశెట్టి
- 26న ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్ కరప్రతాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్ : క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే 100 శాతం నయం అవుతుందని, దీని కోసం రూ.17 వేల విలువైన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు కిమ్స్ ఆస్పత్రి క్యాన్సర్ వైద్య నిపుణులు మధు దేవరశెట్టి తెలిపారు. గురువారం స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్, ఐఎంఏ, కిమ్స్ ఆస్పత్రి ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో ఉచిత క్యాన్సర్ శిబిరం కరప్రతాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు దేవరశెట్టి మాట్లాడుతూ.. చాలా మంది క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు వేలాది రూపాయలు అవుతున్నందున వెనుకంజ వేస్తున్నారని మూడవ, నాల్గవ దశలో పరీక్షలు చేస్తే బతకడం కష్టమన్నారు. తొలిదశలో గుర్తించడానికి తాము ఉచిత పరీక్షలు చేస్తున్నామని, నిర్ధారణ అయితే చాలా మంది ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నందున ఉచితంగా చికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు. 26న కామారెడ్డి కళాభారతిలో నిర్వహించే పరీక్షలకు ఎలాంటి ఆహారం తీసుకోకుండా పరగడుపున రావాలని సూచించారు. సమావేశంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎం.జైపాల్ రెడ్డి, అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి కృష్ణహరి, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి అరవింద్, డాక్టర్ గీరెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డి రూరల్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. గురువారం రుద్రారంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆయన పరిశీలించారు. కార్యదర్శి సిద్దు, తదితరులున్నారు.

సహకార సంఘాలు రైతులు, ప్రభుత్వాలకు వారధి

నస్రుల్లాబాద్: సహకార సంఘాలు రైతులకు ,ప్రభుత్వాలకు మధ్య వారధులుగా పని చేస్తున్నాయని పర్యవేక్షణ అధికారిణి జి.కవిత అన్నారు. గురువారం దుర్కి, మైలారం, నాచుపల్లి గ్రామాల పరిధిలో గల లింగంపల్లి, తిమ్మాపూర్, అంకోల్ తండా, సంగం ఎరువుల గోదాంలను పరిశీలించారు. సొసైటీ అధ్యక్షులు దివిటి శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శులు సుధాకర్, నరేందర్, మోహన్, సిబ్బంది ఉన్నారు.

ఎరువుల నిల్వలు, రసీదు పుస్తకాల పరిశీలన

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గర్గుల్, కామారెడ్డి ఎరువుల గోదాముల్లో ఎరువుల నిల్వలు, రసీదు పుస్తకాలను గురువారం వ్యవసాయ, సహకార శాఖల అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో సహకార అధికారి రాంమోహన్, వ్యవసాయ అధికారి రమ్య పాల్గొన్నారు. సంఘం సీఈవో సతీష్, అమ్మకం సిబ్బంది నుంచి వివరాలు తీసుకున్నారు.

పెద్దమల్లారెడ్డిలో డెంగీ కేసు నమోదు

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో డెంగీ కేసు నమోదు అయ్యిందని గ్రామస్తులు గురువారం తెలిపారు. డెంగీ వ్యాధి వచ్చిన గ్రామానికి చెందిన గోల్కొండ తిరుపతిని మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

‘ఆటో కార్మికులు మాయగాళ్ల వలలో పడొద్దు’

కామారెడ్డి అర్బన్: ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడి పేరిట సమావేశం నిర్వహించడం వారి పబ్బం గడుపుకోవడానికేనని ఆటో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోదాసు నర్సింలు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని రవి కుమార్, సాయిలు అనే వ్యక్తులు ప్రకటనలు చేయడం, డబ్బులు వసూళ్లు చేసి వారి పొట్ట నింపుకోవడానికేనని ఆయన విమర్శించారు. నాయకులు భూషణ్‌గౌడ్, రాజశేఖర్, కృష్ణ, రాములు, డి.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను మెరుగుపరచాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను మెరుగుపరచాల్సిన బాధ్యత కళాశాల అధ్యాపకులపై ఉందని ఇంటర్మీడియట్ మోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు పలు సూచనలు చేశారు.

సిద్ధరామేశ్వరాలయంలో శ్రావణ మాసోత్సవాలు

భిక్కనూరు: భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో నేటి నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణ మాసం ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శ్రీధర్ గురువారం తెలిపారు. ఆలయంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

యువతకు 20 శాతం సీట్లు కేటాయించాలి

ఎల్లారెడ్డి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో యువతకు 20 శాతం సీట్లు కేటాయించాలని ఎల్లారెడ్డి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్ నాయక్ కోరారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల యూత్ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.